క్లుప్తంగా

ఆహ్వానం



వి.హెచ్.హన్మంత్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్: మహాత్మ జ్యోతిరావుపూలే జయంత్యోత్సవాలకు రావాలంటూ కమిటీ సభ్యులు బుధవారం మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హెచ్.హన్మంత్‌రావును ఆహ్వానించారు. కమిటి వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణమాచారి, అధ్యక్షుడు ముద్దగౌని మల్లికార్జున్‌గౌడ్, శివముదిరాజ్ ఆధ్వర్యంలో కలిసి మాట్లాడారు. సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్, బంగి శ్రీను, రఘుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మంచిరేవుల చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ప్రవీణ్‌యాదవ్

మణికొండ: చలివేంద్రాలను పేదలు, బాటసారులు సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మంచిరేవుల చౌరస్తాలో శ్రీవేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పొన్న రమేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, క్రాంతి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న దొంగలు



సైకిల్‌ను ఎత్తుకెళ్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ పరిధిలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లల్లో, ఇంటి ముందు పార్కు చేసిన వాహనాలను దొంగిలిస్తున్నారు. నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని చేతివాటం చూపిస్తున్నారు. బుధవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ద్వారకానగర్‌లోని ఒక ఇంట్లో సైకిల్‌ను ఎత్తుకెళ్లాడు. ఇది సీసీ కెమెరాలో రికార్డు అయింది. సైకిల్ విలువ రూ.15 వేలు అని యజమాని తెలిపారు. ఈ మేరకు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నకిలీ జోతిష్యుల అరెస్టు

- రూ.84వేలు, 4ఫోన్‌లు, కారు సీజ్
- కోకాపేటలో అరెస్టు చేసిన ఎస్‌ఓటీ పోలీసులు



నార్సింగి ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేసిన నకిలీ జోతిష్యులు

మణికొండ: వచ్చీ రాని జోతిష్యంతో ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరిని, ఓ కారు డ్రైవర్‌ను నార్సింగి ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎర్నాల సారయ్య, గిత్త శివకుమార్‌లు తమ మారుతి బ్రెజా కారులో తిరుగుతూ కనిపించిన వారికి మీకు సమస్యలు ఉన్నాయి, ఎవరో మీకు చేతబడులు చేశారు, వాటిని పూజ చేసి పోగొడతాము అని నమ్మిస్తారు. వారు ఇచ్చిన డబ్బులు తీసుకుని వచ్చీరాని పూజలు చేసి అక్కడి నుంచి ఉడాయిస్తారు. బుధవారం కోకాపేటలోని గోల్డన్‌మైల్ లేఅవుట్‌లో తిరుగుతూ కొందరిని మోసం చేయటంతో వారు సమాచారం ఇవ్వటంతో అరెస్టు చేశారు. వారి నుంచి రూ.84వేల డబ్బు, 4సెల్ ఫోన్‌లు, ఓ కారు, మొత్తం రూ.12 లక్షల విలువగల సొత్తును స్వాధీనం చేసుకుని నార్సింగి పోలీసులకు అప్పగించినట్టు ఎస్‌ఓటీ పోలీసులు తెలిపారు.

బీజేపీ నాయకుల హౌస్ అరెస్ట్

రాజేంద్రనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలను బుధవారం ఉదయం నుంచే గృహ నిర్బంధం చేశారు. పలువురు రాజేంద్రనగర్ చౌరస్తా, ఆరాంఘర్, హైదర్‌గూడ, కాటేదాన్ ప్రాంతాల్లో సీఎం దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని ఉదయం నుంచే గృహ నిర్బంధం చేశారు.

గుంతల రోడ్లు

- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు అంతరాయం.. ప్రమాదాలు



ద్వారకానగర్‌లో రోడ్డు దుస్థితి

బండ్లగూడ: మా కాలనీ రోడ్లను పట్టించుకోండంటూ ద్వారకానగర్ కాలనీవాసులు రోడ్డెక్కారు. పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. నగర శివారు గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ద్వారకానగర్ నుండి గాయత్రినగర్ రోడ్డులో డ్రైనేజీ పనులు పూర్తి చేసి 16 నెలలు గడిచినా రోడ్డు మరమ్మతు పనులు మాత్రం చేపట్టకపోవడటంతో ఈ రహదారిలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఏ రోడ్డు చూసినా ఇదే పరిస్థితి నెలకొందని వారు ఆవేదన చెందుతున్నారు.

అస్తవ్యస్తంగా..

రోడ్లు గుంతలుపడి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఈ రహదారి గుండా ఎస్‌ఎఫ్‌సీ కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, వినాయక నగర్, యాదవ మిత్ర కాలనీ, బాలాజీనగర్, డీడీనగర్ తదితర కాలనీలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తిచేసి నెలలు గడుస్తున్నా.. రోడ్డు ప్యాచ్ వర్కు పనులు మరిచిపోయారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడి పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

మరమ్మతులు చేపట్టాలి : కాలనీవాసులు

ఇంట్లోనుండి బయటకు వెళ్ళాలంటే అవస్థలు పడాల్సి వస్తోందని ద్వారకానగర్ కాలనీవాసులు తెలిపారు. ఈ రోడ్ల గుండా ప్రయాణించాలంటే నరకం కనపడుతోందని వాపోయారు. ఇకనైనా అధికారులు మాగోడు పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుదర్శన్, మైఖేల్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, మన్సూర్, నారాయణ, జయారెడ్డి, బాల్‌రెడ్డి, కరెంటు శ్రీను యజాస్ తదితరులు ఉన్నారు.



గుంతలమయంగా మారిన రోడ్డు



రోడ్డుపై ధర్నా చేస్తున్న ద్వారకానగర్ కాలనీవాసులు

అంతర్‌రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు



నిందితుల వివరాలు తెలుపుతున్న ఏసీపీ గంగాధర్

రాజేంద్రనగర్: జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన 15 రోజులకే దొంగతనానికి పాల్పడ్డ ఓ అంతర్‌రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగను రాజేంద్రనగర్ సీసీఎస్, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకుని అతడి వద్ద నుంచి 15 లక్షల రూపాయల విలువ చేసే సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గంగాధర్ వివరాలను వెల్లడించారు. కర్నూల్ జిల్లా, చదువుల రామయ్య కొట్టాలు ప్రాంతానికి చెందిన కొమ్ము వంశీకృష్ణ(29) ఆటో డ్రైవర్. ఇతడు సెల్‌ఫోన్ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడతాడని.. కర్నూల్, తిరుపతి, గద్వాల్, గుత్తి, అనంతపూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఆరు కేసుల్లో నిందితుడని చెప్పారు. గత నెల 23వ తేదీన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 122 పిల్లర్ వద్ద ఉన్న లాట్ మొబైల్ దుకాణంలో జొరబడి యాపిల్-12 ఫోన్‌లు నాలుగు, గెలాక్సి సామ్‌సంగ్ ఫోన్‌లు 8, వన్ ప్లస్ ఫోన్‌లు ఏడు, ఒప్పో, వివో ఫోన్‌లను దొంగిలించాడు. మొత్తం 21 ఫోన్‌ల విలువ 15,38,000 ఉంటుందని దుకాణం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనం చేసిన వాటిలో ఒక ఫోన్‌ను తనకు తెలిసిన బంధువుకు విక్రయించాడు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసులు బుధవారం ఉదయం నిందితుడిని పట్టుకుని అతడి వద్ద నుంచి 15 సెల్‌ఫోన్లు, 8,716 రూపాయల నగదును స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించారు.



ఏసీపీ కార్యాలయంలో శాంతియుత కమిటీ సమావేశం

పీస్ కమిటీ సమావేశం

శంషాబాద్: పండగలను శాంతియుతంగా జరుపుకోవాలని శంషాబాద్ ఏసీపీ భాస్కర్ సూచించారు. రంజాన్, హనుమాన్ శోభాయాత్ర, గుడ్‌ఫ్రైడే సందర్భంగా బుధవారం ఏసీపీ కార్యాలయంలో అన్ని వర్గాల నేతలతో శాంతియుత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవరికి ఇబ్బందులు కలిగించకుండా ర్యాలీలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్, సుల్తాన్‌పల్లి సర్పంచ్ దండు ఇస్తారి, నాయకులు అంజద్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: హనుమాన్ శోభాయాత్ర నేపథ్యంలో రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ కార్యాలయంలో బుధవారం పీస్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా ప్రాంతాల్లోని మత పెద్దలు, దేవాలయ, ప్రార్థన మందిరాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఒక రి పండుగలను ఒకరు గౌరవించుకుంటూ ఆనందోత్సవాల మధ్య పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. శోభాయాత్ర నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

గోల్కొండ: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని నిజాం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యం కారణంగా తమకు ఎంతో అసౌకర్యం కలుగుతుందని, తవ్వకాలతో రోడ్లు అధ్వానంగా మారాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. నానల్‌నగర్ డివిజన్‌లో మొట్ట మొదటి బాక్స్ టైప్ డ్రైనేజీ నిర్మాణం నిజం కాలనీలో జరిగిందని, దీని కోసం కోటి పది లక్షల రూపాయలు వ్యయం జరిగిందన్నారు. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న నిజాం కాలనీలో అన్ని రకాల అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. కాగా ప్రస్తుతం నిజాం కాలనీ, అల్ హస్నాత్ కాలనీ ఎగువ భాగాన ఉన్న బుల్కాపూర్ నాలా మళ్లింపు పనులు జరుగుతున్నాయని ఈ కారణంంగా డ్రైనేజీ పనుల్లో జాప్యం జరిగిందని ఆయన అన్నారు. ఆయన వెంట పలువురు బల్దియా అధికారులతో పాటు పలువురు స్థానిక నాయకులున్నారు.

బండి సంజయ్ అరెస్ట్‌పై భగ్గుమన్న బీజేపీ నేతలు



ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు



అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

శంషాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్‌పై బీజేపీ నేతలు భగ్గుమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. బుధవారం ఉదయం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను బీజేపీ నేతలు దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణ చేతగాని కేసీఆర్ సర్కారు తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షాలపై పడుతుండడం సిగ్గుచేటన్నారు. సంజయ్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా, సీనియర్‌నాయకులు బుక్కవేణుగోపాల్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్, ఎస్సీమోర్చా నాయకులు కె. ప్రశాంత్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేక అక్రమ కేసులు..

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఓర్వలేకనే బీజేపీ నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. బీజేపీ నాయకుడు బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తు రాజేంద్రనగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు బాబురావు, శ్రీనివాస్‌గౌడ్, నాగమణి, బండారి బాలకృష్ణ, సందీప్‌ముదిరాజ్, కోరని క్రాంతి, రవి, కొంగళ్ల నవీన్, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌చారి, రాకేష్‌గౌడ్, తొండపల్లి మల్లేష్, వేణుగోపాల్, సప్నారెడ్డి, యాదయ్య, నవీన్,సుధాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్సింగిలో ..

మణికొండ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ అరెస్టును నిరసిస్తూ బీజేపీ నాయకులు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ కేంద్రాలలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమాల్లో మున్సిపాలిటీల అధ్యక్షుడు సి.బీరప్ప, సీహెచ్. బిక్షపతి యాదవ్, నాయకులు శంకర్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, బి.రవికాంత్‌రెడ్డి, యాదయ్య, శంకర్, కె. ప్రతాప్ రెడ్డి, వెంకటచారి, ఎం. నగేష బి.గణేష్, ఎన్. బుచ్చిరెడ్డి, డి. శ్రీనివాస్, కిరణ్, జి.శివరాజ్, చంద్రశేఖర్, డి. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు చోరీ

- ఇద్దరు అరెస్ట్

గచ్చిబౌలి: రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రాయదుర్గం డీఐ రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఖాజీ గల్లీ, గోల్కొండకు చెందిన కారు డ్రైవర్ సయ్యద్ సోహిల్(20), యూసూఫ్‌గూడకు చెందిన సయ్యద్ జిబ్రెస్ అలియాస్ టబ్రాస్(20) కొంతకాలంగా గోల్కొండ, సైఫాబాద్, రాజేంద్రనగర్, రాయదుర్గం పీఎస్ పరిధిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను చోరీ చేశారని పేర్కొన్నారు. వాహనాల తనిఖీలలో పట్టుబడటంతో పోలీసుల విచారణలో రాయల్ ఎన్‌ఫీల్డ్ చోరీ చేసినట్లు వెల్లడైందన్నారు. నిందితుల నుంచి రూ.4 లక్షల విలువైన నాలుగు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.




ఎంజీబీఎస్ మీదుగా బస్సులు నడపండి

మణికొండ: నార్సింగి, మంచిరేవుల నుంచి అఫ్జల్‌గంజ్, చార్మినార్ వరకు నడుపుతున్న బస్సులను వయా మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ మీదుగా నడపాలని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు పి.మాల్యాద్రినాయుడు కోరారు. ఈ మేరకు ఫరూఖ్‌నగర్ బస్ డిపో మేనేజర్‌కు లేఖ రాశామని ఆయన తెలిపారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి ప్రజలు అత్యధికంగా విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తెలంగాణలోని అనేక పట్టణాలకు రాకపోకలు సాగిస్తారని వారంతా ఎంజీబీఎస్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం అఫ్జల్‌గంజ్‌లో బస్ దిగి ఆటోలలో బస్టాండ్‌కు వెళ్లాల్సి వస్తోందని, ఉన్న బస్సులనే వయా ఎంజీబీఎస్ మీదుగా నడిపితే అనేక మందికి సౌకర్యంగా ఉంటుందని ఆయన లేఖలో పేర్కొన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం

గోల్కొండ: ఉమ్రా యాత్రకు వెళ్లే భాగ్యం ప్రతి ఒక్క ముస్లింకు ఆ భగవంతుడు కల్పించాలని జంట నగరాల మజ్లిస్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జావెద్ అలీ అన్నారు. ఉమ్రా యాత్రకు వెళ్తున్న ఎంజేపీ కంపెనీ మహ్మద్ అఫ్జల్ తదితరులను ఆయన బుధవారం సన్మానించారు. గోల్కొండ మహ్మద్ లైన్స్‌లో ఎంజేపీ కంపెనీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారిని సన్మానించారు.



ఆలోచనను వ్యాపారంగా మార్చడమే ముఖ్యం



విజేతలతో జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి, ఉస్మానియా వీసీ రవీందర్, నిర్వాహకులు

జేఎన్‌టీయూ వీసీ కట్టా నర్సింహారెడ్డి

గచ్చిబౌలి: విద్యార్థులు, యువత తమ ఆలోచనలను వ్యాపారాలుగా మార్చడం చాలా ముఖ్యమైన విషయమని జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. కొండాపూర్‌లోని క్లబ్ బొటానికల్‌లో బుధవారం టై గ్రాడ్ బిజినెస్ ఐడియా టోర్నమెంట్ ఏడవ ఎడిషన్ -2023 ఫైనల్స్ నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. ఓయూ వీసీ దండెబోయిన రవీందర్, టై అధ్యక్షుడు రషీదా అడెన్‌వాలా, హుక్‌సెవెన్ వ్యవస్థాపకుడు కె హర్షిత్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

ఐడియా టోర్నీ విజేతలు వీరే.

టై గ్రాడ్ బిజినెస్ ఐడియా టోర్నమెంట్ విజేతగా ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన హీమాక్ హెల్త్‌కేర్ అంకుర సంస్థ నిలిచింది. నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఫీట్ వింగ్స్ నవజాత సంస్థ రన్నరప్‌గా నిలిచింది.

శేరిలింగంపల్లిని అవినీతికి అడ్డాగా మార్చారు



బీజేపీలో చేరిన వారితో రవికుమార్‌యాదవ్ తదితరులు

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అవినీతికి, భూకబ్జాలకు, అక్రమాలకు, వసూళ్లకు అడ్డాగా మార్చారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ విమర్శించారు. కాలనీలు, బస్తీలలో సమస్యలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. మసీదు బండ, వడ్డెరబస్తీ నుండి సహదేవ్ ఆధ్వర్యంలో యువత బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని గెలిపిస్తే సమస్యలన్నీ దూరం చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ 9 ఏళ్లలో ప్రజలను మాయ మాటలతో మభ్యపెడుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, ఎల్లేష్, అనిల్‌కుమార్‌యాదవ్, బ్రహ్మం, కొండల్, రాములు, నగేష్, అరుణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



ఆరాంఘర్ చౌరస్తాలో నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్లు



బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో.. మేయర్ మహేందర్‌గౌడ్

రాజేంద్రనగర్: మహనీయులు చూపిన మార్గంలో ముందుకు నడవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా పలుచోట్ల వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. పలుచోట్ల అన్నదానాలు చేశారు.



హైదర్షాకోట్‌లో.. కృష్ణారెడ్డి తదితరులు



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వైఎస్‌ఆర్‌టీపీ నాయకులు



మణికొండ మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు



శంషాబాద్‌లో.. బీజేపీ నేతల నివాళి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230